# ఆఖరుకు అంతా దొరికింది.

రచయిత:

మొదలి వెంకటరామయ్య

౧

అప్పుడే తొలికోడి కూసింది.

'ఏమండర్రోయ్! మీాయింట వానకురవా! లేవండర్రా తెల్లారొస్తోంది. కొండామీద పోవాల!' అనే ఒక పెద్ద పొలికేక, మావీధి కుంభకర్ణ సమూహాన్నంతా లేపింది. ఉలిక్కిపడి లేచారందరూనూ. తీరా చూస్తే పేరావధాన్లు. మోకాళ్ళపైకి పంచా, మొలకొక గావంచా, తలగుడ్డగా మరొక గావంచా. ఎడంచేతులో ఆకుచెంబూ, కుడిచేతిలో కర్ర, తాడెత్తున ఉంటాడు. హఠాత్తుగా చూస్తే గుండె పగిలే విగ్రహం- కర్రపొడుచుకొంటూ నిద్రపోతున్న వాళ్ళనందర్నీ కర్రతో పొడిచి లేపుతున్నాడు. అందరూ నిద్రాభంగానికి ఆయన్ను తిత తాల్చిపోస్తూ- పైకి తిడితే ఏమనుకొంటాడోనని- ఒళ్లువిరుస్తూ మంచాల మీాద లేచి కూచున్నారు. కొందరు లేచి లఘుశంకకు వెడుతున్నారు.

పేరావధాన్లు ఇంకా తనయాత్ర సాగిస్తూ 'ఒరే కన్నయ్యా లేవరా! నీయింట పీనిగ వెళ్లా! మీా వెంకడేడీ!' అంటూ ముందుకు సాగబోతున్నాడు. కన్నయ్య రుద్రుడై లేచి, 'ఏమిటయ్యా! ఆ అశుభవాక్కులూ? ఉదయాన్నే! పెద్దవాడివే ఆమాత్రం జ్ఞానం లేదూ?' అని తగులుకున్నాడు. పేరావధాన్లు వెనక్కితిరిగి గొంతు సర్దుకొంటూ, 'పెద్దవాణ్ణి! ఆమాత్రం అనగూడదుట్రా! నీలాంభానికేలే!' అంటూ చల్లగా జారుకున్నాడు. ఆ అక్షింతలు నెత్తినపడగానే ఊరుకోవచ్చునా? మూడో మంచందగ్గిరికిపోయి, 'ఒరే వెంకా! లేరా! పోతున్నారందరూనూ!' అంటూ గాఢ నిద్రలో ఉన్న భ్రమరాంబను, కర్రతో, 'టక్కు'న మోచేతి ఎముకమీాద ఒక్కదెబ్బ వేశాడు. ఆమె ప్రాణాలు పుచ్చుకుంటూ లేచి. తేరిపారజూచి, 'అబ్బ! ప్రాణంతీస్తివి గదయ్యా!' అంది. పేరావధాన్లు నిర్ఘాంతపోయి, 'అమ్మా! భ్రమరాంబవా? వెంకడనుకున్నానులే!' అంటూ అడుగు ముందుకు వేశాడు. 'నీకేం పొయ్యేకాలంవచ్చిందయ్యా! ఆడదో మొగాడో, కనపడలే?' అంటూ ఇంకా ఏమేమో పారాయణంచేస్తోంది. పేరావధాన్లకు కంట్లో మెరిసింది. ఎవర్నీ లేపకుండా దాటిబట్టాడు.

ఎలానయితేనేమి. అగ్రహారీకులంతా చేరారు రాములవారిగుడిదగ్గరికి. ఒక్కొక్కడు రెండేసిగావంచాలూ, ఒకపంచా, ఒక ఆకుచెంబుతో తయారయ్యారు. ఒక అరగంటసేపు ఒకటేగోల. 'ఒరేయ్! గోవిందం! త్వరగారారోయ్! వెనకబడతావ్' నీ, 'నాయనా! నాకొక ఆకుచెంబు తెచ్చావా?' అనీ,

'వినాయకం! మనిద్దరం ముసలాళ్ళం. వాళ్ళతో వేగలేము. వెనక తిన్నగా డేకుదామ' ని 'ఏమండోయ్! ఇటుచూడ్డురూ; రామంగాడు మీతో రావాలని, నాకు చిక్కకుండా పరుగెత్తుకొచ్చాడు' అని ఒకగృహిణి రిపోర్టుచేస్తే ఆరామంగాడిని కేకలువేసి ఇంటికి పంపే గృహస్థాకమూ, నానాగందరగోళంగా ఉంది.

'ఏమయ్రోయ్! కాలకృత్యాలు తీర్చుకొని పోదామా?' అని ఉపపాదించాడొకవృద్ధు. 'దారిలో గుండ్లకమ్మఉంది రావయ్యా!' అని దాన్ని భగ్నంచేశారు కొంచెం శరీరపటుత్వం గలవాళ్లు. ఆఖరుకు ఈసమూహమంతా— పెద్దలు ముప్పైమందీ, పిల్లలు ఇరవైమందీ- బయలుదేరారు, గంగమ్మజాతరచేసుకొంటూ దారిలో సమూహమంతా కొన్ని భాగాలుగా చీలింది. యాభై సంవత్సరాలకు పైబడ్డ వాళ్ళంతా ఒకజట్టు పాతికేండ్లకూ, నలభై ఏండ్లకూ మధ్యవాళ్లు— పిక్కబలంకలిగి, 'దూకుతామంటే దూకుతామ' నేవాళ్లు—ఒకజట్టు మన కిష్కింధాపుర సంబంధీకు లొకజట్టు. కొంతదూరం పోయేసరికి వీరందరి మొఖానా, తెల్లంగా తెల్లవారింది. మధ్యజట్టునుండీ, విశ్వనాథం అనేఆయన, ఆఖరు జట్టులోని, పురుషోత్తం అనే అపర ఆంజనేయులతో, 'ఒరే పురుషోత్తం! ఆవెధవ గుండ్లకమ్మ ఒడ్డున చెట్లేమీ అట్టేఉండవు. మీసమూహాన్ని కమ్మించి మాంచివేప్పుల్లలు విరుచుకొస్తివా, నీపేరు చెప్పుకొంటూ అందరూ తోముకుంటారు' అన్నాడు. ఆమాట వినీ వినకముందే పురుషోత్తం ఉబ్బిపోయాడు. తననే ఇంతమందిలో పెద్దనుజేసి అడిగినందుకు. నిమిషమాత్రంలో మూడోజట్టులోని శాఖామృగాలు పరిసరాల ఉండే వేపచెట్లు అధిరోహించాయి. మరునిమిషంలో వేపకొమ్మలు 'పెళ, పెళ' విరిగి గుట్టలు గుట్టలుగా పడ్డాయి. పిల్లమూకంతా వానిని దంతధావన యోగ్యంగా చిన్నపుల్లలుగా విరిచింది. ఆ పుల్లలన్నీ ఒక కట్టగట్టి, పురుషోత్త యోచించి యోచించి, శివరాముడి నెత్తిన వేశాడు. నాయకుడి ఆజ్ఞానుసారం శివరాముడు దాన్ని చచ్చీచెడి మొయ్యడం మొదలెట్టాడు.

ఇంతలో భగీరథుడికి గంగలాగా, వీరందరికీ, గుండ్లకమ్మ ప్రత్యక్షమైంది. అందరూ కాలకృత్యాలు తీర్చుకున్నారు- వేపపుల్లల కట్ట సక్రమంగా వినియోగపడ్డది. మూడోజట్టులోని కుర్రకుంకలు కొందరు చద్దెన్నమూ, కొందరు ఉప్పుపిండీ మూటకట్టుకొని తెచ్చుకున్నారు. వాళ్లు కాస్త నోళ్లు సరిజేసుకొని, మంచిమాట చేసుకొందామని మాటలువిప్పేసరికి, ఈవాసన ఎలాతగిలిందోకాని, రెండోజట్టువారికి తగిలింది. అంతటితో, వారిని అదివరకూ లేని జఠరాగ్ని బాధించడం మొదలెట్టింది. వారుగూడా కుర్రసమూహం దగ్గరకు తయారయి, వారిని బెదిరించి ఆపాథేయాన్ని కాజేద్దామని ప్రయత్నించారు. కాని ఆకుర్రాళ్లు మరీ గడుసువారవడంచేత, వీరి ఆటలేమీ సాగలేదు. కొంతకుస్తీ అయిన తర్వాత రెండుజట్లూ రాజీకొచ్చాయి. చద్దెన్నమంతా ఒక రాశిగా పోశారు. ఉప్పుపిండంతా ఒకరాశిగా పోశారు. అన్నంతినేవాళ్ళనూ, పిండి తినేవాళ్ళనూ వేరుచేశారు. సమభాగాలు చేసి, తలాః పిడికెడు ప్రాణాహుతు వేసుకొన్నారు. కొందరు మళ్ళీ ఆకలవుతుందేమోనని, తమ భాగాన్ని 'ద్వైధావిభజ్య' అని, ఒకభాగం ఆత్మకు సమర్పించి, రెండోభాగం మూటకట్టుకున్నారు. మొదటిజట్టులోని శ్రోత్రియులు మాత్రం ఈ పాథేయాన్ని స్వీకరించలేదు.

పొద్దుపొడిచి కొంచెమెక్కింది. ఇంకా పన్నెండుమైళ్లుంది గమ్యస్థానం. గావంచాలు నెత్తికి చుట్టుకోని, దారిలో దాహమవుతుందో ఏంఖర్మమోనని, తలాచెంబెడు మంచినీళ్లు చేతబట్టుకోని, అదేపోక పోతున్నారు తిరిగి చూడకుండా. తీరా పెద్దఅగ్రహారం పొయ్యేసరికి, మొదటిజట్టులోని వృద్ధజంబుకాలూ, మూడోజట్టులోని కేవలం పిల్లకోతులూ, తట్టగిలపడ్డాయి. వారంతా 'ఇక తామక్కడనుండీ కదలలేమనీ, సాయంత్రం, ఆసమయానికి అందుకొంటామనీ' చెప్పి, ఆపూట అక్కడే మకాం వేశారు. మిగిలిన రెండో జట్టూ, మూడోజట్టులోని కొందరు హేమాహేమీలూ, బయలుదేరారు, 'భోజనసమయానికి అందుకోలేక పోతామా?' అనే ధీమాతో. పైనా కిందాకూడా కాలుతోంది. అయినా వారు దీక్షతో యాత్రసాగిస్తున్నారు. ఒళ్ళంతా చెమటలు పోశాయి. రొజుకుంటూ, ఒంటిగంట అయేసరికల్లా బ్రహ్మదేవపురం చేరుకున్నారు.

౨

వీధులన్నీ కిటకిటలాడి పోతున్నాయి బ్రహ్మదేవపురంలో. ఏయింటిముందు చూచినా బోరువల్లాగా బ్రాహ్మలు కూచోనున్నారు. పెద్దలందరూ ముందుగానే వచ్చి, దొరికినమట్టుకూ మంచాలన్నీ స్వాధీనంచేసుకోని, పండుకోనున్నారు. ఏయింటిముందు చూచినావారే! ఇంటివారి సంగతి దేవుడికెరుక. కుర్రకారుకు మంచాలు దొరకక, చాపలన్నీ స్వాధీనంచేసుకొని పడుకున్నారు మరెవరైనా సర్దుకొంటారేమోనని. ఈసమూహంలో అక్కడక్కడ చతుర్ముఖ, షణ్ముఖపారాయణాలు జరుగుతూన్నాయి. కొన్నిచోట్ల ఖాతాఖానీలు జరుగుతున్నాయి. కొందరు- చెంబులు తెచ్చుకోని వారు- తదర్థమై ఊరంతా గాలిస్తున్నారు. మీరుమళ్ళీ పాత్రలను భద్రంగా స్వంతదారులకు చేరుస్తారో లేదో అనే సందేహంతో, ఊరిపెద్దలు, 'ఇప్పుడే, మీవారే, ఆరు చెంబులు పట్టికెళ్ళారండీ!' అనీ, 'మాయింట్లో ఉండేదే ఒకచెంబు నాయనా! మా అమ్మాయి ఇప్పుడే దొడ్డికి పట్టికెళ్ళింది!' అనీ, 'మాచెంబులకన్నిటికీ చిల్లులేనండీ! పాపం మీరు వాటితో నీళ్లు తాగలేరు!' అనీ, 'మాచెంబులన్నీ మకిలిపట్టి ఉన్నాయి. మేమే వానిని ఉపయోగించడంలేదు' అనీ, 'చెంబుకేం! ఇస్తాముగాని, అది మారిపోతే, ఒప్పుకోము. కాబట్టి ఈబాధంతా మీకెందుకు' అనీ, ఆ వచ్చినవాళ్ళను సాగనంపుతున్నారు. కొందరు బలిచక్రవర్తులు మాత్రం 'తుభ్యమహం సంప్రదతేనమః' అనుకొంటూ— నువ్వులువినాగా— ఇచ్చేస్తున్నారు పాత్రలను.

ఈలోపల కొందరు గృహిణులు, మాతులమీద చేతులువేసుకోని, 'ఏమయ్యోయ్! బ్రాహ్మలూ! ఆరుగురు కూర్చున్నారే! ఆ మంచం ఉండాలనా? విరగాలనా? లేవండీ?' అనగానే ఒక గడుసువాడు, 'ఇంతమంది నియింటిముందు కూర్చున్నందుకే సంతోషించవమ్మా! అదీ గాక మేమేం ఊరికా కూచున్నామా? పొద్దుపోక పేకాటవేసుకున్నామని తెలియడంలేదూ? నులకల్లో కూచుంటే మంచం విరుగుతుందనే పట్టెలమీద కూచున్నాము. అసలీ మంచం మీదని గుర్తేమిటి? 'అంటూ పేకాట ధోరణిలో పడ్డాడు. ఈజవాబువల్ల ఆ గృహిణికి ఒళ్లుమండి,' ఉండండి! మా ఆయన్ను పిలుస్తాను అంటూ చరచరా లోపలికెళ్ళింది.

మనమూడు జట్లల్లో మొదటిజట్టు తప్ప మిగిలిన రెండుజట్లూ కూడబలుక్కోని, విశ్వ

నాథం యాజమాన్యక్రింద, తలా ఒకఅణా చందా వేసుకొని, కొంతనిధి పోగుచేశారు. ఉదయం పాథేయం చాల్లేదెవ్వరికిని. చందా నిధితో బియ్యంవగైరా సామాన్లుకొన్నారు. సరుకులు కొనేలోపల, కొందరు ఒక అవ్వగారికి టోపీవేసి, వాళ్ళింట్లో వంటచేసుకోవడానికి ఒప్పించి, ఆసామానంతా పట్టించారక్కడికి. ఇక వంటచేసేదగ్గర వచ్చింది తగాదా! ఎవరూ ఆపనికి పూనుకోలేదు. 'అందరూ ఆ కలివల్ల బాధపడుతున్నారనీ, వంటజేయడానికి తగిన స్థితిలో లేరనీ, 'మహాజరు పెట్టుకోగా, అవ్వగారు కటాక్షించి వంటచేయడానికి ఒప్పుకుంది. అదేసందని, ప్రతీవాడూ తలాఒక పడక తయారుజేసుకొని, బైటాయించారు. ఆ అవ్వ చచ్చి చెడి వంటపూర్తి జేసి, ఒక్కసారి కేకబెట్టింది. ఆదెబ్బతో అన్నార్తులందరికీ మెళుకువచ్చింది—అసలువాళ్లు నిద్ర పోతూంటేగా. తాము వెళ్ళగానే, క్రొత్త గ్రహాలు మంచాలను ఆవేశిస్తాయనే ఉద్దేశంతో, అందరూ కూడబలుక్కొని, ఇరవై మంచాలుతీసి, ఆపక్కన శెట్టిగారి ఎద్దుల కట్టేసే ఇల్లుంటే దాంట్లో పడేసి, అవ్వగారింటి తాళంబిగించారు దానికి అందరూ భోజనానికి తయారయ్యారు.

'మామంచం పోయిందంటే, మామంచం పోయిందని' గోలబయలుదేరింది. ఈగోలవిని విశ్వనాథం 'ఒరేయ్! ఏమైనాసరే! రేపు ఉదయంవరకూ మంచాలు కనబడగూడదు' అని ఉత్తరువుచేశాడు.

తలా ఇంత తిష్టవేసుకొని లేచారు. నలుగురు పెరటిదోవను గోడదూకి ఇంట్లో ప్రవేశించి, మంచాలన్నీ బయటికి ఉద్ధరించారు— మామూలుగా తాళంతీసి లోపలికి వెడితే అందరూ చూస్తారనే భయంతో. ఆమంచాలన్నీ అవ్వగారి సావిట్లో వేసుకొని, ఎవరి మట్టుకు వారు గురకలు ప్రారంభించారు, భోజనాలకు పిలుపు వచ్చేదాకా నిద్ర పట్టిస్తామని.

మొదటిబట్టులోని శ్రోత్రియులకు ఆరోజు, అరుణోదయంమొదలు ఇంతవరకూ అన్నప్రాశనలేదుగదూ? వారి ప్రాణాలు అంతరిక్షమార్గాన ఎగిరిపోతున్నాయి. కన్నయ్య 'అరమోడ్పుకనుదోయితో' ఉండీ, హఠాత్తుగా లేచి, 'వెంకా! వంటఎక్కడరా? చెయ్యడం!' అని పృచ్ఛించాడు. వెంకయ్య తలగీరుకుంటూ, 'కందులవారి చావిట్లోనట' అని వినీ వినపడనట్లు సణిగాడు. 'అయితే ఎంతవరకూ వచ్చిందో కనుక్కోరారా! మూడుఝాములు తిరిగింది. స్నానమన్నా ఏడిపించుకొంటాను' అని విసుక్కున్నాడు, వెంకయ్య అవ్వశ్శికం తననెత్తినే పడినందుకు అఘోరిస్తూ, నెత్తిన గుడ్డవేసుకొని, ఆమెర్రటి ఎండలో బయలుదేరి, వేంచేశారు వంటశాలకు. అక్కడ సంభాషణ:—

'నాగభూషణం! ఎన్ని గుండిగలు వార్చావు?'

'మూడు వార్చానండీ! ఇదుగో వంకాయ కూర ఉడుకుతోంది. పప్పు పూర్తయింది. ధప్పళం ఒక్కటే తరవాయి.'

'షుమారు మూడువందలమంది ఒచ్చారు. మూడు గుండిగలేం చాల్తాయి నీమొఖం! ఆఖరుకు ఏడెనిమిదైనా వార్చకపోతే ఎలా?'

'బాబోయ్! ఏడెనిమిదే? నావల్లగాదండీ! మీరిచ్చే రెండురూపాయల భాగ్యానికి నేనింతవంట చెయ్యలేనుబాబూ! ఆఖరుబేరం నాలుగురూపాయలైనా ఇస్తే చేస్తాను. లేక

పోతే, ఉపశేంగా, వంట వదిలేసి వెళ్ళి. పోతాను.'

'అబ్బో! నాలుగే! పోతేపో! బెదిరిస్తావా ఏమిటి? ఇంకెవరూ లేరనుకున్నావా?'

'సరేబాబూ! మీకునమస్కారం!' అని వార్చేవార్చే గుండిగ వదిలేసి, గావంచా పైనేసుకొని పోతూ, 'నాకిస్తానన్న రెండు రూపాయలూ, ఇవ్వమ'ని పేచీపెట్టాడు.

అంతట శెట్టిగారు దయచేసి, 'పోవయ్యా! మహా; నీవొంటోళ్లు లచ్చమంది. వంటంతా చేస్తే అనుకున్నప్రకారం ఇస్తాను. లేకుంటే దమ్మిడీ ఇయ్యను.' అని సవాలుచేశారు.

ఈదృశ్యం చూచేసరికి, 'వంట ఎంతవరకయిందో చూచివస్తామని' వచ్చిన బ్రాహ్మలకందరికీ గుండెపగిలింది. ఇక ఈరోజు భోజనంసున్న అని నిశ్చయించుకున్నారు. తాము కొద్దిగా కలగజేసుకోకుంటే పెంటాకూడు పడదనుకొని, గొంతులు సర్దుకుంటూ, రంగంలోకి దిగారు. పాక పాపుగంట, కుస్తీఅయిం తర్వాత, శెట్టిగారూ, నాగభూషణంగారూ రాజీకొచ్చారు, మూడురూపాయలకు వంటంతా పూర్తి జేసే షరతుమీద. ఆ అపరపాకశాసనుడైన నాగభూషణం మళ్ళీ గరిట చేతికి తీసుకున్నాడు.

* * *

మూడుఝాములు తిరిగింది. అప్పుడు భోజనానికి పిలుపొచ్చింది. గురకల మహాశయులంతా అప్పుడే కడుపునిండినట్టు సంతోషిస్తూ, చెంబులుతీసుకొని స్నానాలకు తయారయ్యారు. మన రెండోజట్టువారు మంచాలను మళ్లీ షైదులోబెట్టి, రెండోసారి సాపాటుకు–ఉదయంనుంచీ లంఖణాం చెడగొట్టుకొని వాండ్లతోసహా—తయారై బయలుదేరారు.

స్నానాలఘట్టం ఒకదిగుడుబావి. కొందరు పరాక్రమవంతులు, యీతలో తమనైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కొందరు యోగవిద్యాకుశలులు, నడిబావిలో ఆసనాలువేస్తున్నారు. కొందరు చెంబులకు మెరుగుపెడుతున్నారు. కొందరు పెద్దపన్నావాళ్లు, నీళ్లల్లో దిగితే మరిబయటికి ఈడ్చేవాళ్లుదొరకరని, నీళ్లఅంచున ఒక శిలాఫలకంమీద తమస్థూలశరీరాన్ని ప్రతిష్ఠించి, చెంబుతో తమకుతామే అభిషేకించుకొంటున్నారు. కొందరు స్నానాలుపూర్తిజేసి ఒడ్డున బట్టలుఆరవేసుకొంటున్నారు. కొందరు. గాలికి బట్టలనుపట్టుకుంటే, అవి ఆరి చేతుల్లోనించి ఎగిరిపోగా వానిని, వెతుక్కుంటున్నారు. కొందరు అతిమడివల్ల ఆఖరుకు మైలబడుతున్నారు. కొందరు స్నానంజేయనివాళ్లు, మడివాళ్లను అపవిత్రంజేసి, వాళ్లవల్ల మంగళహారతులు పొందుతూ, తమ అదృష్టానికి తమనే అభినందించుకొంటున్నారు. కొందరు, జపంజేసుకోవడానికి కింద కూచుంటే తడిబట్టకు మట్టిఅంటుతుందనే ఉద్దేశంతో క్రిందపరుచుకొని కూచోడానికి, పరిసరంలో ఉండేమర్రిచెట్టున ఆకులుకోస్తూ, లపాలన్నీ వంటినిండాపడి అసహ్యంగా ఉంటే పునః స్నానానికి ఉపక్రమిస్తున్నారు. కొందరు జపంయావత్తూ పూర్తిఅయినతర్వాత, భోజనశాలకు వెడుతూ, త్రోవలో దేనిమీదనో కాలువేసి, తమ దురదృష్టాన్ని నిందించుకొంటూ, మళ్లీ గంగాసంయోగానికి దయచేస్తున్నారు. ఇలా ఆదృశ్యమంతా ఒకసినిమాలాగఉంది. అచ్చటిధ్వని, కృష్ణవంతెనమీద, ఎక్స్ప్రెస్ పోతూన్నట్టుగాఉంది.

వారివారిఇబ్బందులన్నీ తీర్చుకొని. అందరూ విస్తళ్లముందు హాజరయ్యారు. భోజనసమ

యంలో ఒకాయన 'విస్తట్లో పిండివంట గైరుహాజరయుందే!' అనగానే, ప్రక్కవారు 'మీరు ఇక్ష్వాకులకాలంలో ఉండవలసినరువా! ఇది శెట్టిగారిసంతర్పణ అని తెలియదుటయ్యా?' అని జవాబు.

'ఏమండోయ్! పప్పుగావాలి'

'ఏం నాకు నాలుగు చేతులున్నాయటయ్యా? ఇక్కడ వడ్డిస్తూండడం కనపడలా?' 'అవునులే! అవసరమున్నప్పుడె వెయ్యకపోతే తర్వాత నీపప్పెవడికిగావాలి! పులుసుఎవడికిగావాలి! అసిస్టెంటును పెట్టుకోకపోయావా? అంతచేలిగాని వాడివి?' 'మాటలు మిగుల్తున్నాయిజాగర్త' 'ఏంజేస్తావేం? నీతాతసొమ్మేమైనా పెడుతున్నావా?' అంటూండగానే ఇద్దరికీ చేతులుచేతులూకలిశాయి. నలుగురూ బ్రతిమాలుకోని విడిపించారు. 'సందట్లో సడేమి' అని, ఈసమయంలోనే, పప్పుఅడుగు బట్టిందనేవార్త అతిథులకందరికీ కర్ణాకర్ణి తెలిసింది.

'ఇందాక పప్పుపెయ్యంది ఇందుకేనా ఏమిటయ్యా? ఆమాట ఇందాకనే వడస్తేనీకు దేహశుద్ధి తప్పేదిగదా! ఇప్పుడు వెయ్యి ఏం వేస్తావో నీపిండాకూడు!' అని ఇందాకటి పేచీకోరు సవాలు.

తన్నులుతిన్న వడ్డనబ్రాహ్మడు, కండ్లెఱ్ఱజేస్తూ, కోపమూశోకమూ దిగమింగుకోవడంలోనే తన అసమర్థతను వెల్లడిస్తూ వంటపందిట్లోకి నిష్క్రమించాడు.

3

ఇంతకూ అసలు విషయమే మరిచిపోయాను. యీబ్రాండమంతా ఎందుకుదిగుమతీ అయిందయ్యా బ్రహ్మదేవపురానికీ అంటే, ఆ వూళ్ళో 'వరహాలు' శెట్టిగారి కనిష్టభ్రాతగారు, అంతకుపూర్వమే కళత్రవియోగంవల్ల నిస్సంతుగలవారై, తన్నివారణార్థమై రంభాసంభోగానికి వెళ్ళి అప్పటికి పన్నెండురోజులట! ఆతరుణాన్ని పురస్కరించుకోని, వరహాలు శెట్టిగారు బ్రాహ్మణులకు 'యావచ్ఛక్తి షోడశోపచార పూజాంకరిష్యే' అంటారనే వార్త అచుట్టుపట్ల పదామడవరకు ఒక నారదులవారు తమపర్యటనంలో ఊదొచ్చారట. ఆరోజు మొదలు, కాలిపాటుగలవారందరూ ప్రయాణసన్నాహం చేశారట. ఇది పూర్వవిషయం.

సాయంత్రందాకా అందరూ ఒక్క నిద్రతో భుక్తాయాసాన్ని తరిమేశారు. మధ్యరకం వాళ్లు సాయంత్రం పికారు కెళ్లొచ్చారు. పెద్దలు సంధ్యావందన విధులు తీర్చుకున్నారు. ఊరిసావిట్లో సభజేసి కులాసాగా కబుర్లు చెప్పుకొంటున్నారు. కామయ్యగారు పిచ్చయ్యగారితో 'వరే పిచ్చిగా! కామధేనువు ఏమాత్రం పిండుతుందంటావు?'

'ఏమాత్రంగూడానా! గొర్రె 'బే, బే' అని రెండుమార్లు నేసరికే బ్రహ్మరంధ్రం అదురుతుంది.'

'ఇంతేనాభాగ్యం! ఏమో మహాకిరీటాలు పెడతాడని రెండామడదేకితిమే?'

'అంతగాకమరి! మనకు 'నక్షత్రం' తప్ప పైని చిల్లిగవ్వగూడా ముట్టదు.'

'పోనీ 'శ్వేతార్థం' అనదూ?'

'అయ్యో! అంత అదృష్టమైతే ఇంకేమి? ఇందాక వంటపందిట్లో శెట్టిగారికీ వంటాయనకూ పోటాపోటీలు చూడలేదూ? అంతే ఇదిగూడా!'

ఈ సంభాషణ ముగియకముందే సమను జారీఅయింది. 'ప్రతిఊరినించీ, వచ్చినటువంటి బ్రాహ్మలపేర్లన్నీ పట్టీలువ్రాసి (ఏఊరివాళ్లు వాళ్ళుపట్టీ) ఇవ్వవలసిందని శెట్టిగారిహుకుం'

అని. అందరికీ చురుకుదనం పుట్టిందప్పుడు. ఆ పళ్ళంగా నిద్రపోయేవారిని కూడా బలవంతాన లేపి— ప్రమాదంవల్ల పేరు పెట్టనోపడదేమోనని— ఊరికో పట్టీ అతి జాగ్రత్తగా తయారుచేశారు. ఈపట్టీలన్నీ శెట్టిగారికి రవాణాఅయినాయి. ఇవన్నీ చూచేసరికి వారిగుండె ఝల్లుమంది. మొత్తం గ్రహాలు నాలుగు వందలపై చిలుకున్నాయి. అంతట శెట్టిగారు సకుటుంబ సపరివార సమేతంగా, తమయింటి నాలుగుగోడలమధ్యా ఒకచిన్న సభ జేశారు. ఈసభలో శెట్టిగారి పట్టమహిషి. 'పెద్దలకు బేడా కుర్రాళ్ళకు అణాఇవ్వాల'ని ప్రతిపాదించింది. దాన్ని తల్పుత్రుడు బలపరిచాడు. ఇంతలో సభాధ్యక్షులూ, 'పాయకపాకశాసనికి భారతఘోరరణంబునందు, నారాయణునవల్లు'గా వరహాలుగారికి చేయూతగాఉండే, వీరన్న శ్రేష్ఠిగారు శెట్టిగారి కళత్రాన్ని, శెట్టిగారి ప్రతిబింబాన్ని— 'ఆత్మావై పుత్రనామాసి' గదండీమరి— మందలిస్తూ, పెద్దలకు సత్రం, పిల్లలకు తదర్థంఇచ్చి, తెల్లారకుండానే, వీరికందరికీని, 'ఆసీమాంతెం' చెప్పాలనీ, మళ్ళీ తెల్లారి వీరుంటే పునః భోజనానికి తయారవుతారనీ, ఉపపాదించారు. ఈఉపపాదన ఏకగ్రీవంగా ఆమోదింపబడింది.

* * *

శెట్టిగారు, 'ఆశీర్వచనానికి బ్రాహ్మలసందర్నీ రమ్మని ప్రార్థిస్తున్నార'ని కబురొచ్చింది చాలామంది పన్నాలు వల్లెవేసినవాళ్లు, తమకేమైనా అగ్రతాంబూలం ముట్టుతుందనే ఉద్దేశంతో ముందుగానే వెళ్లారు. కొందరు సమయానికి వెడదామని మానేశారు. శెట్టిగారి గుమ్మంముందు పందిట్లో అందరూ పీటం వేశారు. శెట్టిగారు వచ్చి కూర్చున్నారు సభకు నమస్కారంచేసి, 'ఇక ఉపక్రమించండోయ్!' అన్నది ఒక అశరీరవాణి. ఆఉత్తరువుతో కప్పలు 'బెక, బెక' లాడాయి.

ఆశీర్వచనాలు పూర్తయినాయని, అచ్చటికి రానివారు పసికట్టి సమయాని కందుకున్నారు. సంభావనల ప్రసంగంవచ్చింది. శెట్టిగారు ఉండూరివారైన బ్రహ్మయ్యగారిని సలహాఅడిగారు రహస్యంగా. బ్రహ్మయ్యగారు,' తమ ఊరివాళ్లు చాలారోజులనుండీ, శెట్టిగారిని కనిపెట్టుకొని ఉన్నారనీ, ఉండూరిమీద శెట్టిగారి అభిమానముండాలనీ' తనగోడ వేదో వెళ్ళబోసుకొని, 'ఉండూరివారికి స్వేతమిచ్చి, మిగిలినవారికి శెట్టిగారి ఇష్టానుసారం ఇవ్వమని సలహాఇచ్చారు. ఇతరులు దీన్ని కనుక్కుంటే ఎలాగనే సందేహంవచ్చింది. బ్రహ్మయ్యగారు యీవిషయాన్ని గోప్యంగా ఉంచుతామని వాగ్దానంచేసిన మీదట శెట్టిగారు సమ్మతించి, తమ ఊరివాళ్ళకు ఇరవై అరు మందికీ, ఇరవై అరు రూపాయలు బ్రహ్మయ్యగారి చేతులో బెట్టారు.

బ్రహ్మయ్యగారూ శెట్టిగారూ లోపలికి వెళ్ళి మథించుకోవడం విశ్వనాథం కనిపెట్టి, అవ్వగారింట్లోంచి శెట్టిగారి పెరటి గోడదగ్గరకొచ్చి పాముచెవులతో అంతావిని, సంగతి సందర్భాలన్నీ అవగాహనచేసుకొని, మరి ముగ్గురిని సాక్ష్యానికై పిలుచుకొనివచ్చి, వారిచేతకూడా వినిపించి మరీపోయాడు. ఈవిషయం ఘడియలో బ్రాహ్మణసమూహానికంతా ఎగబాకింది. ఎవడిమట్టుకు వాడు పైకిచెప్పకుండా సమయంవస్తే నోరుచేసుకొందామని కాచుకొనున్నారు.

తదనంతరం బ్రహ్మయ్యగారు శెట్టిగారి సమేతూ సభలోకివచ్చి, ఖణాయించి నిలబడి 'జలదస్వన గంభీరత నెలుగొప్పగ దంతదీప్తు లెసగ......అలరు చెవుల నఖిలజనంబులు

విన' ఈవిధంగా ఉపన్యాసం ప్రారంభించారు. 'అయ్యా! శెట్టిగారు, తమ్ముడి దుర్మరణం చేత తపిస్తున్నారు. వారికుటుంబం పారంపర్యం గా ఉదారతకు ప్రసిద్ధికెక్కింది. వారుగూడా ఆకీర్తిని పోగొట్టుకోకుండా, తమ యావచ్ఛక్తిని వినియోగించి, ఇక్కడికి వచ్చిన బ్రాహ్మణులకు అర్హ సన్మానంచేస్తారని నమ్ముతున్నాను. అయితే...' అని ఇంకేమో మాట్లాడుతున్నారు. ఆధోరణి సాగలేదు. గుంపులోనించి కొందరు 'ఇకచాలు ఊరుకోండి, చాలాశ్రమతీసుకున్నారు.' అనీ, 'తమరికి గుప్త దానం ఏమాత్రం!' అనీ, 'చేతికి తడి బాగా తగిలిందా?' అనీ, 'మీసంగతి మీరు చూచుకోండి ఇతరులదెందుక'నీ, 'ఈపురుషుడటోయ్! తగుదునని ఏదో మాట్లాడుతున్నాడు' అనీ ఆక్షేపణా పరంపరలు తీవ్రంగా తగిలాయి. ఆయన ఇక మాట్లాడలేక తనవిషయం బయటపడిందని, తోకముడుచుకున్నాడు.

రంగంచెడేటట్టుందని, శెట్టిగారే ఆవిషయాన్ని అందుకోని, 'అయ్యా! శాంతించండి! ఇప్పటి సందర్భాన్ని మాట్లాడుతున్నాను. మీకు సంభావన పూర్తిగా ఇవ్వడానికి నా దగ్గర శక్తిలేదు. కాబట్టీ పెద్దలకు అర్ధా, కుర్రాళ్ళకు పావలా ఇవ్వదలచుకున్నాను.' అని ముగించాడు. శెటి విరమించీ విరమించకముందే, 'అయ్యో! మీకు శక్తి లేకపోతే, ఉండూరివారికి ఇరవై ఆరు రూపాయలెలా ఇవ్వగలిగారు?' అని ఒక జబ్బసత్తువగల పొడుగాటాయన వాక్రుచ్చాడు. 'మాకూ అప్రకారమిస్తేగాని వొప్పుకోము' అని మరొక భేతాళుడు కోపంలో. 'వొకరికిరొట్టా? మరొకరికి తౌంపా ఇస్తారా?' అని వొకరుద్రయ్య. ఈఅధిక్షేపణలతో శెట్టిగారి పోరు పడింది. తమ రహస్యం అప్పుడే ఇంతమందికెలా తెలిసిందా? అని శెటిగారూ బ్రహ్మయ్యగారూ ఆశ్చర్యపడ్డారు.

అంతట వీరన్నశ్రేష్టిగారు రంగంమీద ప్రత్యక్షమై—చాలామథన అయినపిమ్మట—' పెద్దలకు ముప్పావలా, కుర్రాళ్ళకు అరణాలు, ఇస్తామని నిశ్చయించుకున్నారు శెటిగారు. అంతకుపైన దమ్మిడీఇవ్వరట' అని చాటించారు. అందుమీద, 'ఈకేతిగాడెవరోయ్!' అని వొకరూ, 'శెట్టి నీకుగూడా ఎమైనా ముట్టజెప్పాడా?'అని ఇంకొకరు, 'నీకెందుకయ్యా ఈబాధ' అని మరొకరు, 'నీకువారు వకాల్తీచ్చారా? ఏమిటి?' అని నాలుగోఆయనా, అన్నమీదట వీరన్నగారు నిష్క్రమించారు.

శెటిగారి పుత్రరత్నం'సంస్కృతమాత్రిత్య' 'అయ్యా! మాచిన్నాయన చచ్చి నిండా దుఃఖంలో ఉండాము. మీరు బాదపెట్టవద్దు' అంటూ ఏకరువుపెడుతున్నాడు. ఇంతలో వకనాగయ్య అందుకోని, 'ఏంధర్మపన్నాలయ్యా? దుఃఖమట వీడిపిండాకూడు. చిన్నాయన నిస్సంతుగాచస్తే ఆ ఆస్తినీకు సంక్రమించింది. అందుకు ఏడవడమెందుకు? ఆయన బతికుండీ పంచుకుంటే ఏడవ్వాలిగాని. చాలు, ఈ పాటికిదయచెయ్యి!' అన్నాడు. చిన్నశెట్టి కలగ దెలువుకోని, అక్కడినించీ దూసుకున్నాడు.

శెట్టిపట్టమహిషి, ద్వారబంధనం ఆనుకోని నిలబడి, చేతులూ, మెడా లయకుదిరేటట్టు తిప్పుతూ, 'ఏంబామ్మలయ్యా! ఇచ్చింది తీసుకోవాలగాని' అని అంటూంది. నమూమామధ్యంనించీ, 'ఊరుకోఅమ్మా! అంతగా చేతులూ మెడాతిప్పి తేనరాలుపట్టుకుంటాయి. ఆడవాళ్లకెందుకీగొడవ. గరిటపనిఒచ్చినప్పుడు తమర్ని ఆహ్వానిస్తాము. అంతవరకూ ఘోషాలోఉండుతల్లీ!' అని వకశబ్దం. ఆ

మెకు మరినోటమాట లేదు.

ఇంక జేరంకుదరదనీ, రేపుఉంటేగాని లాభం లేదనీ, తెల్సుకోని, బ్రాహ్మణులందరూ అప్పటికేసగం రాత్రిఅయినందున, పడకలు వేశారు. గ్రామచావిట్లో కొందరూ, ఆంజనేయుల దేవళంలో కొందరూ, ప్రతిగృహస్థు ఇంటిముందూ, అఖరుకు ఊరిబయట చింతతోపులో కొందరూ, ఎవరికిదొరికిన మంచాలు వాళ్లూ, ఎవరికిదొరికిన చాపలు వాళ్లూ వేసుకోని, అనిశాశేషాన్ని గడిపి, ఉదయం ఎక్కడి మంచాలక్కడా, ఎక్కడిచాప లక్కడా ఒదిలేశారు. కొందరు దూరం ఊళ్ళకు వెళ్ళవలిసినవారు ఆరాత్రే ఆ ముప్పావులా చేతులో వేసుకోని, ఆఊరికొక సలాంచేశారు.

మన మూడుజట్లవారూ మాత్రం మర్నాటిదాకా ఉన్నారు. మిగిలినవారు 'చచ్చినవాడిపెండ్లికి వచ్చిందేలాభం' అని దొరికినమట్టుకు జమచూచుకోని, మర్నాడు కంటికి కనపడకుండా దాడులేశారు.

౪

మర్నాడు తొమ్మిదిగంటలవరకూ మన మూడుజట్లవారూ ఒక హార్మోనియం, ఒక మద్దెలా, తాళాలూ, ఎక్కడనో సంపాదించి భజనచేస్తూ శెట్టిగారు చేసిన అన్యాయమునకు ఆరోజున భోజనవిషయమై వారిని అడుగుట యిష్టములేక ముష్టెత్తుకుంటే భత్యాలు దొరక్కపోతాయా అనే ఉద్దేశంతో బయలుదేరి ప్రతీవీధి తిరిగారు. ప్రతివారూ, భజన తమఇంటిముందుకు రాకముందే, తవ్వెడుబియ్యం దానికితగినఉప్పూ, మిరపకాయా, చింతపండూ, సిద్ధంగాఉంచుకోని, ఆ భజనపరులు రాగానే, జోలెలో బియ్యంపోసి ఆబుట్టల్లో వ్యంజనసామగ్రి వేస్తున్నారు.

పదకొండుగంటలదాకా యీభజనసాగింది వచ్చినసరుకంతా అవ్వగారింటికి చేర్చారు. అవ్వ మడిగట్టుకోని వంట ప్రారంభించింది. కొందరు మడిగట్టుకోని నీళ్లు తెస్తున్నారు. కొందరు కూరలు తరిగి ఇస్తున్నారు. పెద్దలందరూ స్నానాలుజేసి, అపరరుద్రులలాగా ఒంటినిండా విభూతిరేఖలు ధరించి బిళ్ళగోచీలు పెట్టి, ఝారీచెంబులు చేతబట్టుకోని, సావకాశంగా శెట్టిగారింటిముందుండే వేపచెట్టుకింద సమావేశమయినారు. ఒకాయన బంకమట్టితో శివలింగాన్ని తయారుజేశాడు.

వేపచెట్టుకింద పీటవేసి, దానిమీద పళ్లెం పెట్టి, దాంట్లో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఇంతలో బుట్టనిండా మారేడుపత్రీ, పూలూ తెచ్చాడొకమర్కటయ్య. బ్రాహ్మలందరూ ఏకకంఠంతో పనసలు వల్లెవేస్తూండగా పేరావధాన్లు ఉచ్చైస్స్వరంతో 'ఓం,ఓం' అని ఓంకారాన్ని నాదిస్తూ, పత్రి, పూలతో శివపూజ చేస్తున్నాడు. ఊరిజనమంతా తీర్థంలోలాగా పోర్లబడి, నోళ్లు తెరుచుకోని చూస్తున్నారు.

ఈ అట్టహాసమంతా చూచేసరికి వరహాలుశెట్టికి గుండెపగిలింది, వీండ్లంతా ఏంజేసిపోతారోనని. అంతట వీరన్నశ్రేష్టిగారితోటీ తన అప్తులతోటీ ఆలోచించాడు. వీరన్న మరీ భయస్తుడవడంవల్ల, పూజ ముగియక ముందే వాళ్ళను కాళ్లుపట్టుకోని, వారికి గూడా ఉండారివారితోపాటు ఇచ్చి పంపమని సలహాఇచ్చాడు.

శెట్టిగారికి కాలికిందిమట్టి ఎగిరిపోతూండగా, ఆపూజచేసే చోటికి పరుగెత్తి, అంజలి ఘటించి, కండ్లనీళ్ళ పర్యంత[illegible] 'అయ్యా! పెద్దలకు రూపాయి, పిల్లలకు అర్థ, పూజ

481

చాలించండి స్వామీ.' అని అరిచాడు. పేరావధాన్లు 'ఓం' చాలించి, 'అయితే ఈపూటకు, రాత్రికి భత్యఖర్చు ఎవరిస్తారనుకున్నావు?' అని ఖంగున మోగించాడు.

శెట్టిగారు పనిజరుగుతుందని సంతోషిస్తూ 'భత్యానికి తలాపావులా, బేడా ఇస్తానుస్వామీ?' అని మరొక కేక కేశాడు. 'తప్పవుగదా?' అని మరొకఆయన. 'ఆశివలింగంతోడండీ.' అన్నాడు శెట్టి. ఆమాట చెవిన వేసుకోని, అగ్నిహోత్రావధాన్లగారు, పేరావధాన్లగారితో. 'పేరావధాన్లా! లింగాన్ని విసర్జించూ! శెట్టిగారు రాజీకొచ్చారు పెద్దలకు రూపాయపావలా, పిల్లలకు పదణాలూ ఇస్తారట!' అని తెనిగించారు.

లింగానికి విసర్జనఅయింది. లింగాన్ని పత్రితో సహా నలుగుచూపట్టి, దగ్గరఉన్న దిగుడుబావిలో కలిపొచ్చారు. మళ్ళీ శెట్టి మాట తప్పుతాడేమోనని, సంభావన్లు అప్పుడే ఇవ్వమని పట్టుపట్టారు. శెట్టిగారు ఒప్పుకోని, రూపాయలసంచీతో పందిట్లో కొచ్చారు. పెద్దలందరూ వారిచుట్టూ చేరారు.

పిల్లలకు మొదట ఇచ్చేసి పెద్దలకిస్తామన్నారు. అంతట పిల్లలను పిలిచారు. ఒక కుఱ్ఱాడు. 'శెట్టీ! నాకిప్పుడిరవై యేళ్లు. మొన్ననే పుట్టినరోజు పండగగూడా జరిగింది. మీరు పదణాలిస్తే నేను ఒప్పుకోను.' అనీ, మరొక రామదండులోవాడు, 'నేను ఇరవై ఒకటికి పైబడ్డవాణ్ణని, మొన్న ఎన్నికలట, అప్పుడు మాఊరి ఓట్లజాపితాలో నన్ను చేర్చారు తెలుసునా?' అనీ, మరొకభూతయ్య 'నాకు మీసమూ గడ్డమూ ఒచ్చింది చూడవయ్యా! ఇంకా పిల్లల్లో జమకడతానంటావు' అనీ, ఇంకొక బ్రహ్మచారిగాడు, 'నాకు పదహారోయేట ఒడుగయిందయ్యా! ఇప్పటికి ఆరేండ్లయింది. కావాలంటే పేరావధాన్లగారి నడుగు' అనీ దబాయించడం మొదలెట్టారు.

ఆఖరుకు శెట్టిగారికి విసుగుపుట్టి, మరీ చిన్నవాండ్లందరికీ పదణాలిచ్చి, యీ పేచీకోరులనుగూడా పెద్దల్లో జమకట్టి, తలా రూపాయపావలా— సాలగ్రామదానం — ఇచ్చుకోని, అంతటితో విముక్తుడై, వారికందరికీ నమస్కారంచేశాడు. బ్రాహ్మలందరూ తృప్తులై, అప్పుడు ఆకలినిగూడా మరిచిపోయి, తలాఒక పనసతో శెట్టిగారిని పునః ఆశీర్వదించి, జయసూచక మందహాసాలతో విడిదికి చేరారు.

ఆరోజు మధ్యాహ్నం సుష్టుగా భోంచేసి, మిగిలిన బియ్యమూ వ్యంజనాలూ అమ్మి, తలాఒకఅణా పంచుకోని, ఎండతీవ్రంగా ఉండడంచేత మూడుగంటలవరకూ నిద్రతీసి, సాయంత్రానికి, గావంచాలు, చెంబులకోటిసహా, 'జాః పరమేశ్వరా!' అని జండా ఎత్తేశారు.

. వారు నిష్క్రమించిన తరువాత ఊళ్ళో మంచాలు పోయినాయనీ, చెప్పులు పోయినాయనీ గోల బయలుదేరి వెతకగా చింతతోపులో దర్శనమిచ్చాయట!

త్రోవలో మనమూడుజట్లవారి బాతాఖానీలో, 'విశ్వనాథం! చూచావా? శెట్టి తత్త్వం!'

'మరే? ఆఖరుకు అంతా లేవదీశాంగా!

'సరేగాని, యీమాటు ఆ బ్రహ్మయ్యగాడు కనిపిస్తే బొక్కపెట్టాలి!'

అని సల్లాపాలాడుతూ, అరాత్రి పెద్దగ్రహారంలో మకాంవేసి, మర్నాడు ఝామెండ పడేసరికల్లా, కళేబరాలను ఊరు చేరవేశారు.